సాక్షి మెదక్

శనివారం, 2, ఆగస్టు, 2025



కార్మికులకు లేబర్‌కార్డు అండ

అసంఘటిత కార్మికులకు ఆపద సమయం లో లేబర్‌కార్డు అండగా నిలుస్తుంది.

వివరాలు 8లో ▶



తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠం

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు.

వివరాలు 9లో ▶

పోలీస్ యాక్ట్ అమలు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 31 వరకు జిల్లాలో 30, 30(ఎ) పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

నిబంధనలు తప్పనిసరి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ మాణిక్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని, లేకపోతే బిల్లులు రావని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం చౌహాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. చిలప్‌చెడ్‌లో 54 ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 15 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. గ్రామంలో ఇంటి నిర్మాణాలు చేపట్టిన పలువురికి రెండు విడతల బిల్లులు సైతం వచ్చాయన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి పనులు ప్రారంభించకపోతే మంజూరు పత్రాలు వెనక్కి తీసుకుంటామన్నారు. అదేవిధంగా కొత్తగా ఇల్లు నిర్మించేవారికి సైతం అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేగుంట(తూప్రాన్): పాలిటెక్నిక్‌లో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని చేగుంట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 135 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. చేగుంట పాలిటెక్నిక్‌లో 9 పోస్టులు ఖాళీగా ఉండగా, టెక్నికల్ పోస్టులకు ఎంటెక్, నాన్ టెక్నికల్ పోస్టులకు పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్‌ఎఫ్‌ఐ

మెదక్ కలెక్టరేట్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామర కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మెదక్‌లో నిర్వహించిన విద్యార్థి అధ్యయన యాత్రలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 5 వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తామన్నారు. ముఖ్యంగా నర్సాపూర్‌లోని పీజీ కళాశాలకు సొంత భవనం, మెదక్‌కు ఇంజనీరింగ్, పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. తూప్రాన్, పెద్దశంకరంపేటలలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు తక్షణమే పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు నవీన్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ఖాళీ సీట్లు

మెదక్ కలెక్టరేట్: రామంతాపూర్, బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఎస్సీ, ఎస్టీ శాఖల అధికారులు విజయలక్ష్మి, నీలిమ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ఎస్సీ విద్యార్థులకు ఒక సీటు ఖాళీగా ఉండగా, ఎస్టీ విద్యార్థులకు ఆరు సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు కలెక్టరేట్‌లోని ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కార్యాలయాల్లో లభిస్తాయని సూచించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి



నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న డీఏఓ దేవ్‌కుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు నానో ద్రవ రూప ఎరువులు వాడటం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని డీఏఓ దేవ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తునికి వద్దగా రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. రైతులు నానో ఎరువులను తరలించడం సైతం సులభంగా ఉంటుందని చెప్పారు. అనంతరం కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ పంట మార్పిడి చేయాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా తగిన మోతాదులో ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజ్‌నారాయణ, కోరామండల్ ప్రతినిధి రోషన్, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్



కూచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు చేసుకుంటున్న టీచర్

- తొలి రోజు టీచర్ల ముఖ గుర్తింపు 60 శాతమే
- జిల్లాలో 4,191 మంది ఉపాధ్యాయులు
- మధ్యాహ్నం వరకు 2,500 మంది నమోదు

పాపన్నపేట(మెదక్): టీచర్లలో జవాబుదారి తనం పెంచేందుకు ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌ఎస్ (ముఖ గుర్తింపు) విధానం తొలిరోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 60 శాతం మాత్రమే నమోదైంది. ప్రభుత్వ, లోకల్‌బాడీ, ఆదర్శ, కేజీబీవీ, ఇతర రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన టీచర్లందరూ ఒకేసారి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించడంతో సర్వర్ మొరాయించింది. సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఊపందుకున్నట్లు తెలిసింది. జిల్లాలో 4,191 మంది వివిధ కేటగిరిలకు చెందిన టీచర్లు ఉండగా, మధ్యాహ్నం వరకు సుమారు 2,500 మంది రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. మొదట యాప్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత, ఫొటో క్యాప్చర్ చేసి, కళ్లు బ్లింకింగ్ చేయాలి. అప్పుడు ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు అవుతుంది. కానీ ఫొటో క్యాప్చర్ సమయంలో సర్వర్ బిజీతో, అండర్ ప్రాసెస్ వస్తున్నట్లు టీచర్లు తెలిపారు. ఒక వైపు విద్యార్థులు, మరో వైపు టీచర్ల నమోదుతో సర్వర్ బిజీ అయినట్లు తెలిసింది. కాగా శనివారం వరకు ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు గాడిన పడుతుందని విద్యాశాఖ పేర్కొంది.

మాకొద్దు.. జీపీఓ!

- పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల అనాసక్తి
- రెండుసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా స్పందన కరువు
- పరీక్షకు హాజరైంది కేవలం 142 మంది మాత్రమే



మెదక్‌జోన్: గ్రామ పాలన అధికారి (జీపీఓ)గా పనిచేసేందుకు పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు అనాసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికి రెండుసార్లు పరీక్షలు నిర్వహించినా వెనుకంజ వేశారు. జీపీఓలుగా చేరితే పాత సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోకపోవటమే ఇందుకు కారణం అని తెలుస్తోంది. ఫలితంగా అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

జిల్లాలో 392 రెవెన్యూ గ్రామాలు

జిల్లాలో 21 మండలాలు, 492 పంచాయతీలు ఉండగా, 392 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో 562 మంది వీఆర్‌ఓలుగా జిల్లాలో విధులు నిర్వర్తించారు. గత ప్రభుత్వం వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను తొలగించి వారిని వివిధ శాఖల్లోకి పంపింది. 2023లో అధికారంలోకి వచిన కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖకు పూర్వవైభవం తెస్తామని, గ్రామానికో జీపీఓను నియమించి భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని పేర్కొంది. గతంలో వీఆర్‌ఓలుగా పనిచేసిన వారు తిరిగి రావాలని కోరింది. అందుకోసం రెండుసార్లు రాత పరీక్షలు నిర్వహించింది. అయితే ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. మొదటిసారి జిల్లావ్యాప్తంగా 104 మంది దరఖాస్తు చేసినా, పరీక్షకు 79 మంది మాత్రమే హాజరయ్యారు. వారిలో ఉత్తీర్ణత సాధించింది 47 మంది మాత్రమే. రెండోసారి జూలై 27న పరీక్ష నిర్వహించగా, 73 మంది దరఖాస్తు చేశారు. పరీక్ష రాసింది మాత్రం 63 మంది మాత్రమే. ఈ ఫలితాలు ఇంకా విడుదల కాలేదు. గతంలో జిల్లాలో సుమారు 562 మంది వీఆర్‌ఓలుగా విధులు నిర్వర్తించారు. వారు ప్రస్తుతం జీపీఓలుగా రావటానికి ఆసక్తి చూపటం లేదు.

పాత సర్వీస్ పోతుందని..

గత ప్రభుత్వం రెవెన్యూశాఖ నుంచి 562 మంది వీఆర్‌ఓలను తప్పించి వివిధ శాఖల్లోకి పంపింది. అయితే పని చేసిన సర్వీస్‌ను ప్రస్తుతం పనిచేస్తున్న శాఖలో కలపాలని అప్పట్లో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు ఆందోళన చేసి కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు ఐదేళ్లుగా కోర్టులో కొనసాగుతుంది. కాగా ప్రస్తుతం మళ్లీ ఈ శాఖను వదిలి గ్రామ పాలనాధికారి (జీపీఓ)గా చేరితే పాత సర్వీస్ పోతుందని, ఇప్పటికే రెవెన్యూలో ఒక్కొక్కరం రెండు దశాబ్దాలుగా విధులు నిర్వర్తించామని, ఆ సర్వీస్ పోతే తీరని నష్టం జరుగుతుందని, అందుకే జీపీఓగా రావడానికి ఇష్టపడటం లేదని పలువురు వీఆర్‌ఓలు పేర్కొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

కలెక్టర్ రాహుల్‌రాజ్



మహిళకు రేషన్‌కార్డు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్)/చిన్నశంకరంపేట(మెదక్)/నర్సాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి ఆయా మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 9,964 కుటుంబాలకు నూతన రేషన్‌కార్డులు అందజేశామని తెలిపారు.మహిళా సాధికారితకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. రేషన్‌కార్డు ప్రతి కుటుంబానికి అవసరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రామాణికమని, దానిని దృష్టిలో ఉంచుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా మండలంలో విద్యార్థులకు రవాణా వ్యవస్థను మెరుగు పరచాలన్నారు. నిబంధనలు పెట్టకుండా అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నశంకరంపేటలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా కొరత సృష్టించిన, అధిక ధరలకు విక్రయించినా లైసెన్స్‌లు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కులో కాటేజీలను పరిశీలించారు. నెలాఖరులోగా పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

కార్పొరేట్‌కు దీటుగా సంక్షేమ హాస్టళ్లు



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పాపన్నపేట(మెదక్): సంక్షేమ హాస్టళ్లు కార్పొరేట్‌కు దీటుగా ఉండాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన కొత్తపల్లి ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ముందుగా విద్యార్థులతో మమేకమై వారి సా మ ర్థ్యాలను పరిశీలించారు. వసతి సౌకర్యా లు, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? అని స్వయంగా అడిగి తెలుసుకున్నా రు. విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచిగా చదువుకొని సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

జనహితకు జేజేలు

కాంగ్రెస్ పాదయాత్రకు అనూహ్య స్పందన

- ఆద్యంతం ఉత్సాహంగా.. ఉల్లాసంగా..
- దారిపొడవునా హోరెత్తిన నినాదాలు



పాదయాత్రలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి, పీసీసీ చీఫ్ మహేశ్, మంత్రి దామోదర

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. ఆ పార్టీ కార్యకర్తలు కదం తొక్కారు. అందోల్ మండలంలోని సంగుపేట చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించి పాదయాత్రను ప్రారంభించారు. మంత్రులు, దామోదర రాజనర్సింహ, వివేక్, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్న ఈ పాదయాత్రలో ఆద్యంతం కార్యకర్తలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా కనిపించారు. పాదయాత్ర సందర్భంగా 'జై కాంగ్రెస్ .. జై సోనియా, జై రాహుల్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దారి పొడవునా వారి పాదయాత్రకు స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున భారీ సైజుల్లో ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు.

ప్రజాహితమే మా ధ్యేయం: దామోదర

ప్రజాహితమే తమ ప్రభుత్వ ధ్యేయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధ్యక్షతన జోగిపేటలోని హనుమాన్ చౌరస్తా వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల తర్వాత సోనియా గాంధీపై నమ్మకంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు అవకాశం కల్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయమని స్పష్టం చేశారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నాం: పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి తమకు అప్పగించిందని విమర్శించారు. తొమ్మిది రోజుల్లో రైతు భరోసా పథకం కింద రూ.9వేల కోట్ల పెట్టుబడి సహాయాన్ని అందించి రైతుల ఇళ్లల్లో పండగ వాతావరణం కల్పించిందని చెప్పారు. సన్న వడ్లకు బోనస్ అందించామని, రేషన్‌కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు.

వచ్చే ఏడాదిలో లక్ష ఉద్యోగాలు: వివేక్

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో డబుల్‌బెడ్‌రూంలు అందజేయలేదని కానీ ప్రజాప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఒక్కొక్క వాగ్దానాన్ని పూర్తిచేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాబోయే ఏడాదిలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని వెల్లడించారు.

అవగాహన, అప్రమత్తతే కీలకం

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



సైబర్ వారియర్స్‌తో ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీస్ అధికారి పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు సైబర్ క్రైం, నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలను నిరోధించేందుకు ప్రతి పోలీస్ అధికారి సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతి కేసును సీరియస్‌గా తీసుకొని బాధితులకు తక్షణ న్యాయం జరిగేటట్లు చూడాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే గోల్డెన్ అవర్‌లో సంప్రదిస్తే డబ్బులను తిరిగి తెచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు పూర్తి అవగాహన, అప్రమత్తతతో ఉండాలని సూచించారు. అనంతరం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ నుంచి వచ్చిన టీషర్ట్స్‌ను సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

డీఈఓ రాధాకిషన్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మడూర్ జెడ్పీ పాఠశాలలో తెలుగు పండిత్‌లకు నిర్వహించిన కాంప్లెక్స్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధన విషయంలో నైపుణ్యతను చాటి చెప్పాలన్నారు. తెలుగు ఉపాధ్యాయులకు ఉన్న ప్రత్యేక గుర్తింపును కాపాడుకోవాలన్నారు. పాఠ్యాంశాలతో పాటు నీతి, ప్రేరణ కల్గించే కథలను విద్యార్థులకు చెప్పాలన్నారు. ప్రభుత్వం అందించిన డిజిటల్ బోర్డును ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ప్రతిభను పరిశీలించారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి ఉన్నారు.

చినుకు పడితే.. వణుకే!

సాక్షి ఫోకస్

- పేటలో ముంపు ముప్పు తప్పేనా..?
- శాశ్వత చర్యలకు పడని ముందడుగు
- ఇళ్లలోకి చేరుతున్న వర్షం నీరు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు



అక్కల గల్లీలో ఇంటిలోకి ప్రవేశించిన వరద నీరు

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణంలో మోస్తారు వర్షం కురిసిందంటే చాలు ప్రధాన రహదారులు జలమయం అవుతున్నాయి. ఏకంగా అక్కల బస్తీలోని ఇళ్లలోకి వరద నీరు ప్రవేశిస్తుంది. దీంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పట్టణంలో గతంలో ఎప్పుడో నిర్మించిన రహదారులు, మురుగు కాలువలు పాక్షికంగా శిథిలమై యథేచ్ఛగా వదర నీరు రోడ్డుపై పారుతుంది. ఏ రోడ్డుపై ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు భయం, భయంగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రధాన రహదారి జలమయం

ఇటీవల కురిసిన వర్షాలకు సిద్దిపేట ప్రధాన రహదారిపై పెద్దఎత్తున వరద నీరు ప్రవహించింది. రోడ్డుపై ఇసుక మేటలు వేసింది. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురై కింద పడిన సంఘటనలు ఉన్నాయి. మున్సిపల్ సిబ్బంది రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను తొలగించినా, మళ్లీ వర్షం కురవడంతో రోడ్డుపై ఇసుక చేరింది. చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరు నిలిచి ప్రయాణాలకు ఆటంకంగా మారుతుంది. డివైడర్ నిర్మించిన అధికారులు రోడ్డు మరమ్మతుల విషయమై పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే మోస్తారు వర్షం కురిసినా పట్టణంలోని 11వ వార్డు అక్కల బస్తీలో వరదనీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుంది. ఏటా తమకు ఈ ఇబ్బందులు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దఎత్తున వరద నీరు ఇళ్లలోకి చేరిందని, ఇళ్లలో ఉన్న దుస్తులు, నిత్యావసర సరుకులు సైతం తడిసిపోయాయని వాపోయారు.



రామాయంపేట- సిద్దిపేట ప్రధాన రహదారిపై నిలిచిన వరద నీరు



రోడ్డుపై వరద నీరు నిలవడంతో పక్క నుంచి వెళ్తున్న విద్యార్థులు

చర్యలు చేపడుతున్నాం

వర్షాలు పడితే రహదారులపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాం. ఇటీవల తారు రోడ్డుపై భారీ వర్షం మూలంగా ఇసుక మేట వేయగా, పూర్తిగా తొలగించాం. అక్కల గల్లీలో ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటాం.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల పీఓ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ స్టడీస్, సోషల్ సబ్జెక్ట్‌లను ఇంగ్లిష్ మీడియంలో బోధించే ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఈడీతోపాటు టెట్ అర్హత సాధించిన వారు అర్హులని, ఈనెల 5 లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని పాత గ్రామపంచాయతీ సమీపంలోని ఓ వ్యక్తి ఇంట్లో కొందరు పేకాటాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. వారి వద్ద నుంచి రూ. 28100 నగదుతో పాటు 4 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి..



గంజాయి విక్రేతను అరెస్టు చేసిన పోలీసులు

చేగుంట(తూప్రాన్): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు నాగులమ్మ కాలనీలో జార్ఖండ్‌కు చెందిన అస్మవుల్‌షేక్ గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడు ఉంటున్న ఇంటిని తనిఖీ చేసి 160 గ్రాముల గంజాయిని, నిందితుడి ఫోనును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతోనే విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని రామాయంపేట ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ బాలయ్య, సిబ్బంది ఎల్లయ్య, చంద్రయ్య, రాజు, నరేశ్, హరీశ్, రవి, నవీన్ పాల్గొన్నారు.

కత్తితో బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

రూ.వెయ్యి జరిమాన

మెదక్ మున్సిపాలిటీ: డబ్బులు దోచుకెళ్తూ కత్తితో బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... 2024లో మెదక్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో శేకులు అనే వ్యక్తి నుంచి సిల్వేరి విల్సన్ డబ్బులు లాక్కొని వెళ్తుండగా బాధితుడు గట్టిగా కేకలు పెట్టాడు. దీంతో అక్కడున్న భక్తులు పట్టుకునే ప్రయత్నం చేయగా విల్సన్ వారిని కత్తితో బెదిరించినట్లు తెలిపారు. ఈ మేరకు అప్పటి సీఐ కేసు నమోదు చేయగా శుక్రవారం కోర్టులో విచారణకు వచ్చింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ విల్సన్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు విషయంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం... పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 51మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.1,04,500 జరిమానా విధించారు.

కార్మికులకు అండగా లేబర్‌కార్డు

జిల్లాలో 25వేల మంది కార్మికులు

87,607 మందికి ఈ– శ్రమ్‌కార్డులు ● 67,316 మంది వ్యవసాయ కార్మికులు





మెదక్‌లో పనికోసం అడ్డాపై కూర్చున్న అసంఘటిత రంగ కార్మికులు

మెదక్ కలెక్టరేట్: అసంఘటిత కార్మికులకు లేబర్ కార్డు అండగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వ్యవసాయ ఆధారం లేకపోవడంతో పట్టణాలకు చేరుకుని భవన నిర్మాణ రంగంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ఉన్నప్పటికీ సరైన కూలీ గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. మరోవైపు పట్టణంలోని పేదలు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే ప్రమాదవశాత్తు పనిచేస్తున్న చోట జరగరానిది జరిగి కాలు, చేయి విరగడం, ప్రాణాలుపోతే అతడిపై ఆధారపడిన కుటుంబం రోడ్డున పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కార్మికుల కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలబడి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం లేబర్‌కార్డును అందజేస్తుంది.

25 వేల మంది కార్మికులు

జిల్లాలో మెదక్, నర్సాపూర్, రామాయంపేట మూడు అసిస్టెంట్ లేబర్ కార్యాలయాలు ఉన్నాయి. కాగా జిల్లా వ్యాప్తంగా అసంఘటిత రంగ కార్మికులు 25వేలు మంది ఉండగా, 87,607 మంది ఈ-శ్రమ్‌కార్డులు పొంది ఉన్నారు. అందులో 67,316 మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారు.

రూ.110 కొండంత అండ

అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు కేవలం రూ.110 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో లేబర్ కార్డు లభిస్తుంది. అడ్డా కూలీలు, భవన నిర్మాణ కూలీలకు ఈ కార్డు ఆపద సమయంలో కొండంత అండగా నిలుస్తుంది. కూలీలు చేసే పనులన్నీ ప్రమాదాలతో కూడినవే. నిర్మాణ పనులు చేసే సమయంలో ఏదైన ప్రమాదానికి గురైతే ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుంది. ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులు విరగడంతో పాటు ఏదైనా తీవ్ర గాయం జరిగితే ప్రమాద తీవ్రతను బట్టి సుమారు రూ.3 లక్షల వరకు అందజేస్తుంది.

ఒక్క ఏడాదిలో 256 వరకు..	
డెలివరీ బెనిఫిట్స్	175
మ్యారేజ్ కానుకలు	68
సాధారణ మరణాలు	9
యాక్సిడెంటల్ మరణాలు	4

పెళ్లికి, డెలివరీలకు..

అసంఘటిత రంగ కార్మికుడు కూతురు పెళ్లికి రూ.30 వేలు, డెలివరీకి రూ.30 వేల చొప్పున రూ.60 వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే అసంఘటిత కార్మికురాలి పెళ్లి కానుకగా రూ.30 వేలు, ఒక్కో డెలివరీ కానుకగా రూ.30 వేల చొప్పున రెండు డెలీవరీలకు రూ.60 వేలు ప్రభుత్వం అందజేస్తుంది.

రూ.6.50 కోట్లు

భవన నిర్మాణ కార్మికులు రోడ్డు ప్రమాదంలో గాని, పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షలు, సాధారణ మరణం సంభవిస్తే రూ.1.30 లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. జిల్లాలో 2018 నుంచి ఇప్పటివరకు కార్మికుల పెళ్లిళ్లకు, డెలివరీలకు, ప్రమాదంలో గాయపడిన వారికి, మరణించిన వారికి మొత్తం రూ.6.50 కోట్లు ప్రభుత్వం అందజేసింది.

ప్రాసెసింగ్‌లో 50 దరఖాస్తులు

జిల్లాలో ప్రస్తుతం మరో 50 వరకు దరఖాస్తులు ప్రాసెసింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా పెళ్లిళ్లు, డెలీవరీలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే కార్మికుల అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాం.

– సత్యేంద్రనాథ్, జిల్లా కార్మికశాఖ ఇన్‌చార్జి

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సిద్దిపేటఅర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఆ తరువాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల పరిపాలన స్తంభించిపోయిందని, సమస్యలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశంలో అమెరికన్ సామ్రాజ్యవాదానికి తలుపులు బార్లా తెరిచారని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25 శాతం టారిఫ్‌ను పెంచి దేశంపై సుంకాలు విధిస్తుంటే ప్రధాని నోరు మెదపడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు అసహనానికి గురికాకముందే ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్, యాదగిరి, అరుణ్‌కుమార్, బాలనర్సయ్య, శ్రీనివాస్, నవీన, శారద, కృష్ణారెడ్డి, శిరీష, ప్రశాంత్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా నిధులిచ్చాం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, పాలకవర్గ సభ్యులు

- మీరేం తీసుకొచ్చారు?
- రూ.20 కోట్ల నిధులు ఆపేసిన కాంగ్రెస్
- ఆ పార్టీ నేతలవి అవగాహనలేని వ్యాఖ్యలు
- మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ధ్వజం

సిద్దిపేటజోన్: పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా సిద్దిపేట మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు అప్పటి మంత్రి హరీశ్‌రావు సహకారంతో సమానంగా నిధులు కేటాయించామని బీఆర్‌ఎస్ పార్టీ సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు పేర్కొన్నారు. మేము ఇచ్చిందే కానీ, కాంగ్రెస్ వచ్చాక ఆ పార్టీ కౌన్సిలర్లు తెచ్చిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీల కౌన్సిలర్లు చేసిన ఆరోపణలను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఖండించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు కౌన్సిలర్లు ఏకపక్షంగా ఎజెండా రూపకల్పన చేసినట్టు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భార్యల పదవులను అడ్డం పెట్టుకుని భర్తలు రాజకీయం చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.20 కోట్ల మేర అభివృద్ధి పనుల నిధులను ఆపివేసిందని ఆరోపించారు. సిద్దిపేటకు ఆపిన నిధులను గూర్చి మంత్రులను అడిగే ధైర్యం లేని నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఉన్న ఐదు వార్డులకు మాత్రమే ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. కలెక్టర్ స్పందించి అన్ని వార్డులకు ప్రభుత్వ నిధులు వచ్చేలా చూడాలన్నారు. అధికారం ఉందని, తమ వార్డులకు మాత్రమే నిధులను మంజూరు చేయడం సరికాదన్నారు. స్మార్ట్ సిటీ పథకం కింద ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్ని వార్డుల్లో అభివృద్ధి చేశారని, ప్రస్తుతం 90శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగతా 10 శాతం పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు లక్ష్మణ్, ప్రవీణ్, సుందర్, యోగి, నాగరాజురెడ్డి, మల్లికార్జున్, అరవింద్ రెడ్డి, సాయికుమార్,సతీశ్, కోఆప్షన్ సభ్యులు షాహిద్, సత్తయ్య, నాయకులు తిరుమల్ రెడ్డి, అక్తర్, మోహిజ్, రాజేశం, రాజు, శ్రీహరి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ వద్దు

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): పరిశ్రమల ఏర్పాటు పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూ సేకరణ చేయవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం నాయకులు మండల పరిధిలోని మాందాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ... గ్రామంలో గల సర్వే నం.22లో సుమారు 300 ఎకరాల భూమిని దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్నారు. అలాంటి రైతుల భూమిని ప్రభుత్వం బడా కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని, ఒక వేళ భూములు ఇవ్వాల్సి వస్తే 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి కోల్పోయిన రైతుల ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ఇచ్చి, వారి ఒప్పందంతో భూములు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో వృద్ధాప్య, వితంతు పెన్షన్‌లు రూ.4016, వికలాంగుల పెన్షన్ రూ.6016 ఇస్తామని వాగ్దానాలు చేశారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య మండల కమిటీ సభ్యులు బాబురావు, శాఖ కార్యదర్శి సుధాకర్, అమృతమ్మ, రమేశ్, సంజీవులు, మాజీ సర్పంచ్ శ్రీశైలం, విక్రం, రైతులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మొగుడంపల్లి మండలం పర్వతాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ. రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఇజ్రాయిల్(42) సెంట్రింగ్ కూలీ పనులకు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మూడు రోజుల క్రితం భార్యతో గొడవపడి ఇంటికి నిప్పంటించాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బాలిక అదృశ్యం



దుర్గ భవానీ

కల్హేర్(నారాయణఖేడ్): ఇంటి నుంచి వెళ్లిన బాలిక అదృశ్యమైంది. కల్హేర్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం బ్రహ్మణపల్లికి చెందిన దుర్గ భవాని కల్హేర్‌లోని మేనమామ రమేశ్ వద్ద ఉంటోంది. గురువారం సాయంత్రం ఇంటి నంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆరుతడి పంటల సాగుతో లాభాలు



రైతుకు పీఎస్‌బీ బాటిల్‌ను అందజేస్తున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: ఆరుతడి పంటల సాగుతో మంచి లాభాలు వస్తాయని తునికి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్, మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రైతులకు సూచించారు. శుక్రవారం అగ్రికల్చర్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మూసాపేటలో రైతులకు ఆరుతడి పంటల సాగు, బిందు సేద్యం, డ్రిప్ ఇరిగేషన్ ప్రయోజనాలను వివరించారు. దీంతోపాటు పంటల సంరక్షణ పాస్పరస్ సెల్యూబ్లిజిగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) గూర్చి వివరించారు. విత్తన శుద్ధి, భూసార పరీక్షల వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ పేరుతో సైబర్ మోసం

రూ.2లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: పార్సిల్ పేరుతో ఓ వ్యక్తి రూ. 2 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మున్సిపల్ పరిధిలోని శ్రీవాణి నగర్‌కు చెందిన ఓ వ్యక్తి జులై 20న గిఫ్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఈ క్రమంలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాక అతడికి యూకేకు చెందిన జేమ్స్ అనే వ్యక్తి నగదుతోపాటు షూ పార్శిల్ పంపుతానని, వీడియో చేసి పంపాడు. కొద్దిసేపటికి కొరియర్ నుంచి కాల్ చేస్తున్నామని కొరియర్ పంపేందుకు కొంత నగదు చెల్లించాలని, పలు దఫాలుగా పన్నుల పేరుతో బాధితుడు నుంచి రూ.2 లక్షలు ఆన్‌లైన్ ద్వారా వేయించుకున్నారు. తిరిగి మరలా చెల్లించాలని అడగడంతో బాధితుడు మోసపోయినట్టు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు, శుక్రవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హోటళ్లలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

- జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ జయరాం
- ఉడిపి శ్రీకృష్ణ హోటల్‌కు రూ.5 వేలు జరిమానా



ఉడిపి హోటల్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ జయరాం

దుబ్బాక: హోటళ్లలో నాణ్యతలేని ఆహారపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ జయరాం హెచ్చరించారు. దుబ్బాక పట్టణంలోని ఉడిపి శ్రీకృష్ణ హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా సాంబార్‌లో పురుగులు రావడంతో గురువారం బాధితులు వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ జయరాం శుక్రవారం ఉడిపి హోటల్‌ను తనిఖీ చేశారు. అక్కడ వాడుతున్న ఆయిల్, పప్పు దినుసులు, కారంపొడి శాంపిల్స్‌ను సేకరించారు. అలాగే ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తొలగించారు. ఈ సందర్భంగా హోటల్ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సేకరించిన శాంపిల్స్ పరీక్షల ఫలితం వచ్చాక తగు చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లలో నాణ్యతలేని ఆహారం ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని సూచించారు.

రూ.5 వేల జరిమానా..

ఉడిపి హోటల్‌లో వంటగదితో పాటు పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆస రాజశేఖర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధించారు.

జోరుగా మట్టి దందా?



అక్రమంగా మట్టిని తీసుకువచ్చి పోస్తున్న టిప్పర్

అర్ధరాత్రి రిసార్ట్‌లకు తరలింపు

- నంబర్ ప్లేట్లు లేని టిప్పర్ల వినియోగం
- ఏడుపాయల టీ జంక్షన్ వద్ద తంతు
- పట్టించుకోని అధికారులు



అనుమతులు లేని ప్రదేశంలో మట్టిని చదును చేస్తున్న జేసీబీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయల వన దుర్గాదేవి సన్నిధికి వెళ్లే రహదారి పొడవున అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలు, వాటికోసం అవసరమైన మట్టిని తరలించేందుకు అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. తప్పుడు అనుమతుల పత్రాలతో, అర్ధరాత్రి మట్టి రవాణా చేయడం, అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడకపోవడంతో యథేచ్ఛగా అక్రమంగా మట్టి దందా చేస్తున్నారు. పైగా తాము 'నాయకులమని', మమ్ములను ఎదిరించేవారు ఎవరంటూ.. ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్న ఘటనలు పరిపాటిగా తయారయ్యాయి. అధికారుల అడ్డగోలు అనుమతులతో ఈ దందా కొనసాగుతోందన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

20 ఎకరాల్లో రిసార్ట్‌కు...

ఎప్పుడూ నీటితో పారే మంజీరా నదికి పక్కన పచ్చని పంటల పొలాలతో తులతూగుతున్న భూములపై కన్నుపడ్డ కొందరు.. ఇక్కడి రైతులకు పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి పొలాలను లీజుకు తీసుకుని రిసార్ట్‌లు, భవనాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ అనుమతులు లేని నిర్మాణాలు వెలిశాయి. ఇందులో కొన్ని బఫర్ జోన్ పరిధిలో కూడా ఉన్నాయి. ముడుపులకు ఆశపడ్డ అధికారులు, అటువైపు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. మరిన్ని నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇందుకోసం పెద్ద మొత్తంలో మట్టి అవసరం ఏర్పడటంతో అక్రమ మట్టి రవాణా దందా నడుస్తోంది. రింగుగా ఏర్పడ్డ కొందరు పెద్ద మొత్తంలో దందా నిర్వహిస్తున్నారు. తాజాగా 20 ఎకరాల పరిధిలో రిసార్ట్ నిర్మాణానికి 'నేను నాయకున్ని, నాకెవరు అడ్డు చెప్పేదని చెప్పుకుంటున్న ఓ అక్రమార్కుడు ఈ మట్టి రవాణాకు తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాపన్నపేట మండలం పరిధి నుంచి అర్ధరాత్రి తప్పుల తడకతో ఉన్న ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా మట్టిని టిప్పర్ల ద్వారా తీసుకెళ్తున్నారు. అనుమతి పత్రంలో చూపించిన ట్టుగా నంబర్ ప్లేటులేని టిప్పర్లను మట్టి రవాణాకు వినియోగించడం, పైగా అర్ధరాత్రి రవాణా చేస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. దీంతో సర్కారు ఆదాయానికి సైతం గండి కొడుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రిసార్ట్ ఏర్పాటు, అనుమతుల విషయమై పోతంశెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శి అరుంధతిని వివరణ కోరగా... ఎలాంటి అనుమతులు లేవని ఆమె సమాధానమిచ్చారు.

కేసులు నమోదు చేస్తాం



అర్ధరాత్రి మట్టి రవాణా చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా రవాణా చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌చారి, తహసీల్దార్, కొల్చారం

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి..



జగన్మోహన్

కంది(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొలంపేటలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన జగన్మోహన్ (42) గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని ఊదం చెరువుకట్ట వద్దకు వెళ్లాడు. అక్కడే మద్యం తాగిన అతడు ప్రమాదవశాత్తు చెరువులోకి జారి పడ్డాడు. శుక్రవారం గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి కూలీ..

కంగ్టి(నారాయణఖేడ్): కూలీ పనికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తుర్కవడ్‌గాం గ్రామంలో చోటు చేసుకొంది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కిందిదొడ్డి సోపాన్(37) గురువారం స్థానిక రైతు శెట్కార్ ఏశప్పకు చెందిన పత్తి చేనులో కిందిదొడ్డి శంకర్, తులసీరాంతో కలిసి రసాయనాల పిచికారీకి నీరు మోసేందుకు మద్యం తాగి వెళ్లాడు. సమీపంలోని బావిలో నుంచి నీరు మోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. కాగా గమనించిన తోటి కూలీలు బావిలోని నీటిని మోటారు సాయంతో బయటకు తోడగా శుక్రవారం ఉదయం బావిలో మృతదేహం లభించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సిద్ధ దుర్గారెడ్డి తెలిపారు.

అనారోగ్యంతో బీహార్ వాసి..

పటాన్‌చెరు టౌన్: పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... బీహార్‌కి చెందిన మురళి కుమార్ (32) బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారంలో ఉంటూ స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో పడుకున్న అతడు శుక్రవారం ఉదయం నిద్రలేవలేదు. దీంతో తోటి కార్మికులు, స్థానికులు మురళిని ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌పైనుంచి కిందపడి..

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్ అదుపుతప్పి కిందపడటంతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన మేకలకాడి నాగరాజు(37) గురువారం సాయంత్రం కౌడిపల్లిలో అంగడికి వెళ్లి కూరగాయలు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి తన బైక్‌పై వెళ్లాడు. రాత్రి తిరిగి బైక్‌పై ఇంటికి వెళుతుండగా మండలంలోని ధర్మసాగర్ శివారులో రోడ్డుపై బైక్ అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుడు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.